ABN ఆంధ్రజ్యోతి

# ఈజీగా చేరుదాం!

## మెట్రో ప్రయాణం.. మరింత సులభం

లాస్ట్‌మైల్ కనెక్టివిటీ మెరుగుపరిచిన హెచ్‌ఎంఆర్‌ఎల్

● 8 సంస్థలతో ఒప్పందం ● స్టేషన్ల నుంచి ఇళ్లకు చేరేందుకు రవాణా సదుపాయాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి దగ్గర నుంచి మెట్రోస్టేషన్‌కు, ఆ తర్వాత ఆఫీసుకు, తిరిగి ఇంటికి తక్కువ ధరతో చేరుకునేందుకు హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ (ఎంహెచ్‌ఆర్‌ఎల్) చర్యలు చేపడుతోంది. మెట్రో రైల్ టికెట్ కన్నా రవాణా చార్జీలు అధికమవుతుండడంతో ప్రయాణికుల వినతి మేరకు స్టేషన్ల నుంచి కనెక్టివిటీని పెంచేందుకు వివిధ సంస్థల యాజమాన్యాలతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. ప్రధానంగా రాత్రివేళల్లో రైలు దిగిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు తక్కువ ధరతో కూడిన వాహనాలను అందుబాటులో ఉంచుతోంది. నగరంలోని 57 స్టేషన్ల గుండా ప్రతినిత్యం 4.80 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అయితే ఉదయం పూట ఇంటి నుంచి సమీపంలోని మెట్రోస్టేషన్‌కు వెళ్లడం, రైలు దిగిన తర్వాత ఆఫీసులకు చేరుకోవడం, తిరిగి రాత్రి ఇంటికి రావడం చాలామందికి ఇబ్బందికరంగా మారింది. మెట్రోస్టేషన్ల నుంచి ఆర్టీసీ ఫీడర్ సర్వీసులను నడిపించాలని, ఫస్ట్‌మైల్, లాస్ట్ మైల్ కనెక్టివిటీని పెంచాలని ప్రయాణికులు తరచూ మెట్రో, ఎల్‌అండ్‌టీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన అధికారులు స్టేషన్ల నుంచి కనెక్టివిటీని పెంచేందుకు చర్యలు తీసుకున్నారు.

### 8 సంస్థలతో హెచ్‌ఎంఆర్‌ఎల్ ఒప్పందం

లాస్ట్‌మైల్ కనెక్టివిటీలో భాగంగా హెచ్‌ఎంఆర్‌ఎల్ సంస్థ 8 పేరొందిన రవాణా యాజమాన్యాలతో ఒప్పందం కుదుర్చుకుంది. టీఎస్‌ఆర్‌టీసీ, ర్యాపిడో, స్విధా, మెట్రోరైడ్, హలా మొబిలిటీ, రైడ్‌ఈజీ, యారీ, మన యాత్రీతో కలిసి మెట్రో ప్రయాణికులకు సేవలందిస్తున్నట్లు ప్రకటించింది. లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కింద స్విధా సంస్థ ఇప్పటి వరకు 50 లక్షల మందిని చేరవేసినట్లు వెల్లడించింది. ఫస్ట్ మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని ఏకీకృతం చేయడం ద్వారా మెట్రో ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తున్నట్లు ఎల్‌అండ్‌టీ ఎండీ కేవీబీరెడ్డి తెలిపారు. రోజువారి ప్రయాణికుల్లో 1.10 లక్షల మంది ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ వినియోగించుకుంటున్నట్లు ఎల్‌అండ్‌టీ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళీ వరదరాజన్ పేర్కొన్నారు.



### రవాణా సదుపాయాలు ఇలా..

| | |
|---|---|
| rapido | అన్ని మెట్రోస్టేషన్లలో టూ వీలర్ సౌకర్యం |
| | రాయదుర్గం, సైబర్ లైనర్స్‌తోపాటు అన్ని మెట్రోస్టేషన్ల నుంచి బస్సులు |
| svida | బాలానగర్, జేఎన్‌టీయూ, ఎల్‌బీనగర్, మెట్టుగూడ, మియాపూర్, పరేడ్‌గ్రౌండ్స్, ప్యారడైజ్, రాయదుర్గం, తార్నాక, ఉప్పల్, నాగోల్, లక్డీకాపూల్, హబ్సిగూడల నుంచి 7-22 సీటర్స్ సదుపాయం |
| MetroRide | రాయదుర్గం స్టేషన్ నుంచి ఫోర్ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు |
| | రాయదుర్గం, కేపీహెచ్‌బీ, ఉప్పల్, అమీర్‌పేట్, నాగోల్, హైటెక్‌సిటీ, పెద్దమ్మగుడి, సికింద్రాబాద్ ఈస్ట్, ఎంజీబీఎస్, ఎల్‌బీనగర్ నుంచి యారి ఆటోలు, బైకులు |
| Rideasy | నాగోల్, మియాపూర్ స్టేషన్లలో రైడ్ ఈజీ బైకులు |
| Hala | రాయదుర్గం స్టేషన్‌లో హలా మొబిలిటీ సెల్ఫ్ డ్రైవింగ్ టూ వీలర్ సదుపాయం |
| namma yatri | అన్ని మెట్రోస్టేషన్ల నుంచి నమ్మ యాత్రి ఆటోలు |







డిజిటల్ టికెట్‌ను ప్రారంభిస్తున్న ఎన్వీఎస్ రెడ్డి, ప్రతినిధులు

### గూగుల్ వాలెట్ సదుపాయం

మెట్రో ప్రయాణికుల కోసం రూట్ మొబైల్, బిల్‌ఈజీ భాగస్వామ్యంతో రిచ్ కమ్యూనికేషన్ సర్వీసెస్ (ఆర్‌సీఎస్) ఆధారిత టికెట్ కొనుగోలు, గూగుల్ వాలెట్ సేవలను మంగళవారం ఎల్‌అండ్‌టీ, హైదరాబాద్ మెట్రోరైల్ ప్రారంభించింది. హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్‌అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌సీఎస్, గూగుల్ వాలెట్ సమీకరణం దేశంలో ప్రజాసేవలను డిజిటలైజ్ చేసేందుకు కొత్తమలుపు తిప్పుతుందన్నారు. రూట్ మొబైల్ గ్రూప్ సీఈవో, ఎండీ రాజ్‌దీప్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ తాము ప్రతిరోజూ అనుభవాలను సులభతరం చేసేందుకు, మెరుగుపరిచేందుకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. బిల్‌ఈజీ ఫౌండర్, సీఈవో ఆకాశ్ పాటిల్, మెట్రోరైల్ సీవోవో సుధీర్ పాల్గొన్నారు.


Source : https://epbeta.andhrajyothy.com